క్లుప్తంగా

12న గంగాలమ్మ తల్లి జాతర



గంగాలమ్మ తల్లి

అడ్డతీగల: అడ్డతీగలలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పవనగిరి క్షేత్రంలో గంగాలమ్మ జాతర ఏప్రిల్ 12న నిర్వహించనున్నట్టు క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. గిరిజనుల ఆరాధ్య దైవంగా కొలవబడే గంగాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. పవనగిరి క్షేత్రం ద్వారా 100 గ్రామాలకు అమ్మవారి ప్రతిమలను సారె, చీర, ఘటం, పూజాద్రవ్యాలను వితరణ చేయనున్నట్టు పేర్కొన్నారు. సామూహిక పూజలు జరుపుతామన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతికి సంతాపం

హుకుంపేట: మండలంలోని భీమవరం పంచాయతీ మద్దిపుట్టు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పాంగి కొండబాబు శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గ్రామంలో పర్యటించి, కొండబాబు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు. అనంతరం బారమసి గ్రామంలో పర్యటించి మాజీ సర్పంచ్ సతీమణి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆమెను పరామర్శించారు. నాయకులు రామకృష్ణ, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు కవల విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఎటపాక: ఇటీవల జరిగిన జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి జరిగిన పరీక్షలో గన్నవరం గ్రామానికి చెందిన కవలలు ఎంపికయ్యారు. మైపా అచ్యుత్‌కుమార్, మైపా హర్షిత్‌కుమార్ తోటపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నారు. వీరు ప్రవేశ పరీక్షలో 94, 93 ఉత్తమ మార్కులు సాధించి ప్రవేశ అర్హత పొందారు. ఆయా విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ కడియాల వెంకట్ , సిబ్బంది శనివారం అభినందించి ఘనంగా సన్మానించారు. హెచ్ఎం చైతన్య, జ్యోతి , నాగేంద్రమ్మ, నమ్రత, వరలక్ష్మి, కేశవి, ఖాసిం, నాగేశ్వరరావు, సాంబశివరావు, ప్రసన్న, కిరణ్, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



శాంతమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

కొయ్యూరు: బాధిత కుటుంబానికి ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డి.వి.డి.ప్రసాద్ అండగా నిలిచారు. ఆయన ఆధ్వర్యంలో పలువురు బాధిత కుటుంబానికి శనివారం ఆర్థిక సాయం అందజేశారు. కినపర్తి పంచాయతీ వలసంపేటకు చెందిన చదల శాంతమ్మ తాటాకు ఇంటిపై జీలుగు చెట్టుపడి ఆమె ఇల్లు ధ్వంసమైంది. దీంతో దాత ప్రసాద్ రూ.6400 శాంతమ్మకు అందజేశారు. వలసంపేట నుంచి గ్రామస్తులు రూ.రెండు వేలు, 50 కిలోల బియ్యం అందజేశారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దుచ్చరి చిట్టిబాబు, పాత్రికేయులు లవకుశ, దేముడు, భీమరాజు, అబ్బాయిదొర తదితరులు పాల్గొని ఆర్థిక సాయం అందజేశారు.

సీఐటీయూ నేతకు పరామర్శ



పరామర్శిస్తున్న నాయకులు

రాజవొమ్మంగి: ఇటీవల మోటారుసైకిల్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజవొమ్మంగికి చెందిన సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టా రామరాజును పలువురు ప్రజాసంఘాల నాయకులు, ఆశ, అంగన్‌వాడీ సంఘాల నాయకులు శనివారం ఆయన స్వగృహంలో పరామర్శించారు. రామరాజు రాజవొమ్మంగి నుంచి ఏలేశ్వరం వెళ్తుండగా ఆవు అడ్డంగా రావడంతో అదుపుతప్పి పడిపోయి గాయాల పాలైన సంగతి తెలిసిందే. చికిత్స అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన రామరాజును గిరిజన సంఘం, చేతి వృత్తుల వారు. ఇతర సంఘాల నాయకులు పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్నారు.

వడదెబ్బ.. తస్మాత్ జాగ్రత్త





ఎండతో గొడుగుల నీడలో గిరిజన మహిళ రైతులు

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఆందోళనలో ప్రజలు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

ముంచంగిపుట్టు: చల్లటి వాతావరణానికి పేరొందిన మన్యం ప్రస్తుతం వేడెక్కుతోంది. గత కొన్ని రోజులుగా పగటిపూట ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా వేసవి ప్రారంభంలోనే ఎండ తీవ్రత ప్రతాపం చూపుతుంది. గత నెల వరకు ఉదయం 9 గంటల వరకు మంచు కురుస్తూనే ఉండేది. ప్రస్తుతం ఉదయం 9 గంటలకే సూర్యప్రతాపం ఎక్కువగా కనిపిస్తుంది. దీంతో రానున్న రోజులను తలుచుకొని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితులను గమనిస్తున్న వైద్యులు వేసవి ఎండల బారి నుంచి రక్షించుకునేందుకు తగు సూచనలు చేస్తున్నారు. ఎండ ప్రభావం చూపుతుందని, దీని వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వడదెబ్బకు కారణాలు..లక్షణాలు

శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి కావటం, శరీరం ఉష్ణాన్ని కోల్పోవడం. వడదెబ్బకు గురైన వారిలో చెమట పట్టి శరీరంలోని లవణాలు తగ్గిపోవడం, శరీరంలో నీటి నిష్పత్తి తగ్గిపోవడం సంభవిస్తుంది. అధిక ఉష్ణోగ్రత ఉన్న ప్రదేశాల్లో ఎక్కువ శ్రమతో కూడిన పని చేస్తున్నప్పుడు చెమట రూపంలో శరీరంలోని నీరు కోల్పోతుంది. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, పసి పిల్లలు, గుండె జబ్బులు, అధిక రక్తపోటు వంటి అనారోగ్యంతో బాధపడేవారు వడదెబ్బకు ఎక్కువగా గురవుతుంటారు. విపరీతమైన తలనొప్పి, తల తిరగడం, తీవ్రంగా జ్వరం కలిగి ఉండడం, మగత నిద్ర లేదా కలవరింతలు, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లడం వడదెబ్బ యొక్క లక్షణాలు.

తీసుకోవల్సిన జాగ్రత్తలు

ఎండలోకి వెళ్లేటప్పుడు గొడుగు వాడడం, తెలుపు రంగు, పలుచటి చేనేత వస్త్రాలను ధరించడం, తలకు టోపీ లేదా రుమాలు వాడడం, వేడి గాలులు తగలకుండా చూసుకోవాలని **వైద్యులు** సూచి**స్తున్నారు.** ఉదయం **10 గంటల** నుంచి **సాయంత్రం 4 గంటల** మధ్య కాలంలో ఆరుబయట అధిక శరీర శ్రమతో కూడిన పని చేయకుండా ఉండాలని చెబుతున్నారు. ఎండవేడిమి ఎక్కువగా ఉన్నప్పుడు బయటకు రాకుండా ఉండేలా చూసుకోవాలి. శీతల పానీయాలు, మంచు ముక్కలు తీసుకుంటే గొంతుకు సంబంధించిన అనారోగ్యం ఏర్పడుతుంది ఈ కారణంగా వాటిని తీసుకోకుండా ఉండడం మంచిది. ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు మంచి నీరు తాగాలి. అత్యవసర సమయంలో ఎండలో వెళ్లాల్సి వచ్చినపుడు చల్లని నిమ్మరసం, కొబ్బరి నీరు, చల్లని మంచి నీరు తాగడం మంచిది.



సీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్న రోగులు

అప్రమత్తంగా ఉండాలి



వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ గల ప్రదేశానికి చేర్చాలి. చల్లటి నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు అలాగే చేస్తుండాలి. ఫ్యాన్ గాలి, చల్లని గాలి తగిలేలా చూడాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజ్ ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం తాగించాలి.వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి నీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తరలించి, తక్షణమే చికిత్స అందజేయాలి. అప్రమత్తంగా ఉండాలి.

– **రమేష్**, వైద్యాధికారి, కిలగాడ పీహెచ్‌సీ, ముంచంగిపుట్టు

రైతులు విధిగా రిజిస్ట్రీ చేయించుకోవాలి

చింతపల్లి: రైతులు విధిగా రిజిస్ట్రీ చేయించుకోవాలని ఉద్యాన శాఖ సహాయకుడు ఎస్.కై లాస్ చెప్పారు. మండలంలోని లమ్మసింగి, రాజుబంద, అసరాడ, భీమనాపల్లి గ్రామాల్లో శనివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఫార్మర్ రిజిస్ట్రీలో రైతుల వివరాలు నమోదుచేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ రాయితీలు వర్తించాలంటే తప్పనిసరిగా రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలన్నారు. ప్రతీ రైతుకు విశిష్ట సంఖ్య ఇవ్వటం జరుగుతుందన్నారు. దీంతో పథకాలు, వ్యవసాయ యంత్ర పరికరాల పొందుటకు అర్హులు అవుతారన్నారు.తలయారీ కళ్యాణ్ పాల్గొన్నారు.

వాహనం పైనుంచి పడి హమాలీ మృతి



మృతుడు నాగేశ్వరరావు

వీఆర్ పురం: మిరపకాయల లోడుతో వస్తున్న వాహనంపై నుంచి పడి హమాలీ మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శ్రీరామగిరి గ్రామం నుంచి మిరపకాయల లోడు వాహనంపై హమాలీలతో ఎక్కించుకొని వస్తుండగా వడ్డుగూడెం కాలనీకి చెందిన ముత్యాల నాగేశ్వరరావు (51)ఫోన్‌లో మాట్లాడుతూ అదుపుతప్పి వాహనంపై నుంచి కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కోతులగుట్ట ఆస్పత్రికి తరలించారు. మార్గంమధ్యలో మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంగారావు సేవలు మరవలేనివి

- అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: రంగారావు సేవలు మరవలేనివని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. కొంతిలి గ్రామానికి చెందిన తాంగుల రంగారావు పెందుర్తి ఏరియా గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారుడిగా, కస్టమ్స్ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తు అనారోగ్యంతో బాధపడుతు విశాఖలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు మృతుడి స్వగ్రామమైన కొంతిలిలో శనివారం అంత్యక్రియలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కొంతిలి గ్రామానికి చేరుకుని రంగారావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాడే మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతుడి కుటుంబానికి ధైర్యం చెప్పి పరామర్శించారు. రంగారావు చిన్నతనం నుంచి చాలా ఆప్యాయతంగా ఉండే వారని గిరిజన ఉద్యోగుల సేవా సంఘం తరపున అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. రంగారావు సేవలు మరవలేనివన్నారు. పెందుర్తి ఏరియ గిరిజన ఉద్యోగుల సేవా సంఘం ప్రతినిధులు చిట్టిబాబు, సర్పంచ్ రేగం రమేష్, నాయకులు శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

శివలింగం ప్రతిష్ట నేడు

జి.మాడుగుల: గాంధీనగరం గ్రామంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శివలింగం మహా ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఉగాది పర్వదినాన భీమిలి సద్గురు సేవాశ్రమం ప్రతినిధి సాయిరాం స్వామిజీ ఆధ్వర్యంలో జరుగుతుందని ఎస్ఎస్ఎఫ్ జిల్లా నాయకుడు మత్స్యరాజు తెలిపారు. తెల్లవారుజాము నుంచి పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు పవిత్రమైన జలం, పంచామృతం, పండ్లుతో అభిషేకం చేసుకోవచ్చని అయన చెప్పారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ క్రీడకు ఎంపికైన క్రీడాకారులు

అచ్యుతాపురం రూరల్: రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో సీనియర్ విభాగంలో ఎంపికలు నిర్వహించినట్టు రగ్బీ జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకునాయుడు, అధ్యక్షుడు డాక్టర్ జగదీష్ తెలిపారు. వచ్చే నెల 14, 15 తేదీల్లో అనంతపురం జిల్లా డీటీసీ పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహించే ఈ పోటీలకు అనకాపల్లి జిల్లా నుంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో గెలుపొంది దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రమేష్, అప్పలనాయుడు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రామారావుకు అభినందనలు



అకిరి రామారావు

రంపచోడవరం: రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగ అధ్యక్షుడిగా అకిరి రామారావును నియామిస్తు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. అకిరి రామారావు అడ్డతీగల గ్రామానికి చెందిన వారు. ఆయన నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.ఆయనకు అభినందనలు తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టండి

- డీపీవో లవరాజు



కార్యదర్శికి సూచనలు ఇస్తున్న డిపీఓ లవరాజు

అరకులోయటౌన్(అనంతగిరి): గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని పాడేరు డీపీవో లవరాజు ఆదేశించారు. మండలంలోని పినకోట పంచాయతీ కోటపర్తి గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శుల దేనని చెప్పారు. క్రమం తప్పకుండా వాటర్ ట్యాంక్‌లు, బావులను క్లోరినేషన్ చేయడమే కాకుండా, ప్రతి 15 రోజులకు ఒక సారి తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో ఎ.వి.వి. కుమార్, కార్యదర్శి జి. సతీష్, సర్పంచ్, ఎంపీటీసీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్,తదితరులు పాల్గొన్నారు.

పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పరామర్శ



ఈశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి: మండలంలో అంతర్ల గ్రామానికి చెందిన వలంటీర్ కావడం ఈశ్వరరావు అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వలంటీర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట గూడెం కొత్తవీధి మండల పార్టీ అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్, నాయకులు హేమంత్, మోరి రవి తదితరులున్నారు.


ఎన్డీయే ప్రభుత్వ తీరుపై ధ్వజం



జెడ్పీటీసీ జానకమ్మ

దుంబ్రిగుడ: పార్లమెంట్ ఆవరణలో అరకు కాఫీ స్టాల్ ప్రారంభోత్సవానికి అరకులోయ ఎంపీ తనూజరాణిని ఆహ్వానించకపోవడం దారుణమని, వైఎస్సార్‌సీపీ నాయకురాలి పట్ల ఎన్డీయే, కూటమి ప్రభుత్వం వ్యవహరించిన తీరు చాలా బాధాకరమని దుంబ్రిగుడ జెడ్పీటీసీ సభ్యురాలు చటారి జానకమ్మ చెప్పారు. ఈ సందర్భంగా ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ దేశానికి దిశా నిర్దేశం చేసే పార్లమెంట్‌లోనే ప్రోటోకాల్‌ను పాటించకపోతే ప్రజాస్వామ్యం అపహాస్యమైనట్టేనన్నారు. విలువలు పాటించాల్సిన పార్లమెంట్‌లోనే అరకులోయ ఎంపీ గుమ్మా తనుజారాణికి ఎన్డీయే ప్రభుత్వం అగౌరవపరిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరకు కాఫీ స్టాల్ ప్రారంభోత్సవానికి ఎంపీ తనూజారాణిని ఆహ్వానించకపోవడం గిరిజన జాతిపై చులకన చూపునకు ఎన్డీయే ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిదర్శనమన్నారు. గిరిజన జాతికే తీరని అవమానమని ధ్వజమెత్తారు. గిరిజనుల ఎదుగుదలకు ఎన్డీయే తోడ్పాటు ఇవ్వదని అందుకు నిదర్శనం ఇటువంటి ఘటనలు సాక్ష్యం అన్నారు. ఇకనైనా ఇటువంటి తప్పిదాలు జరగకుండా ఎన్డీయే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలను ప్రతిపక్షాల నుంచి చవిచూడాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా కృషి



అంటబోంగులో నీటి సరఫరా చేస్తున్న సర్పంచ్ పార్వతమ్మ, ఎంపీటీసీ నబ్బో

ముంచంగిపుట్టు: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా కృషి చేస్తున్నానని సర్పంచ్ పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యులు నబ్బోలు అన్నారు. మండలంలోని బరడ పంచాయతీ అంటబొంగు గ్రామంలో శనివారం నీటి సరఫరాను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలోని ప్రతి గ్రామంలో నీటి సమస్యను గుర్తించి, దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి, ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. పంచాయతీ కార్యదర్శి ధనుర్జయ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సూర్య, వీఆర్‌పి నీలకంఠం , వార్డు సభ్యులు రోయిల, బుద్దు, నందో, లోకనాథ్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు టీడీపీలో వర్గపోరు

ముంచంగిపుట్టు: మండలంలోని టీడీపీలో వర్గ పోరు నడుస్తుంది. శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నాడు ఇది బహిర్గతమైంది. టీడీపీ మండల అధ్యక్షుడు కిలో బలరాం ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించగా, పార్టీ అరకు నియోజకవర్గం ఆర్గనైజింగ్ సెక్రటరీ పాంగి శాస్త్రిబాబు ఆధ్వర్యంలో వేరే చోట కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల జరిగినప్పటి నుంచి ఈ వర్గ పోరు టీడీపీలో కొనసాగుతూ వస్తుంది. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పాంగి రాజారావును అధిష్టానం ప్రకటించడంతో మండలంలోని కొంత మంది నేతలకు నచ్చలేదు. దీంతో గత ఎన్నికల్లో పోటీ చేసిన సీవేరి అబ్రహంకు శాస్త్రిబాబు వర్గం మద్దతు తెలుపుతూ పనిచేసింది. పార్టీలో రెండు వర్గాలు పోటాపోటీగా ప్రచారం చేసినా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం ఎమ్మెల్యేగా గెలుపొందారు. బలరాం, శాస్త్రిబాబు వర్గాల వర్గపోరు తారాస్థాయికి చేరుకుంది.

ఈకేవైసీ కోసం 20 కిలోమీటర్ల ప్రయాణం




20కిలో మీటర్లు ప్రయాణించి వనుగుమ్మకు వచ్చిన రంగబయలు గిరిజనులు

ముంచంగిపుట్టు: మండలంలో అత్యంత మారుమూల రంగబయలు పంచాయతీలోని రేషన్‌కార్డు దారులు ఈకేవైసీ కోసం శనివారం 20 కిలో మీటర్లు ప్రయాణించి వనుగుమ్మ పంచాయతీ కేంద్రానికి వచ్చారు. ఈకేవైసీ చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని,ఈకేవైసీ చేసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయలేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ కేంద్రంతో పాటు మండల కేంద్రానికి ఈకేవైసీ,ఆధార్ అప్‌టుడేట్ కోసం తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని,పిల్లలతో గత వారం రోజులుగా తీవ్ర అవస్థలు పడుతున్నామని రంగబయలు పంచాయతీ వాసులు తెలిపారు. గతంలో వలంటీర్ల వ్యవస్థ ఉండడంతో గ్రామాలకు వచ్చి ఈకేవైసీ, ఆధార్ అప్‌టు డేట్,సంక్షేమ పథకాలు వంటి ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చేవాళ్లని, ప్రస్తుతం అన్ని పనులకు గ్రామాల నుంచి పంచాయతీ,మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని వారు తెలిపారు. ప్రభుత్వం స్పందించి గ్రామాల్లోనే అన్ని పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని,ఇబ్బందులు తొలగించాలని రంగబయలు పంచాయతీ మట్టిగూడ, కోసంపుట్టు,జోడిగుమ్మ,పట్నపడాల్‌పుట్టు,మల్లేపాదర్ గ్రామాలకు చెందిన గిరిజనులు కోరుతున్నారు.

ఊరటనిచ్చిన వర్షం

మండలంలో పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. గత వారం రోజుల నుంచి ఎండతీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షంతో ఊరటనిచ్చింది.

జి.మాడుగుల



సూర్యోదయపు సోయగం



ప్రకృతి అందాలకు మన్యం ఆలవాలయం.. ఎటుచూసినా ఎత్తైన కొండలు.. పచ్చని పైర్లు దర్శనమిస్తాయి. ప్రకృతి ప్రేమికులకు ఇక్కడి రమణీయ దృశ్యాలు కట్టిపడేస్తాయి. పాడేరు జాయింట్ కలెక్టర్ బంగ్లా సమీపంలో శనివారం సూర్యోదయం కనువిందు చేసింది.. ప్రకృతి రమణీయతను చూసిన ప్రకృతి ప్రేమికులంతా ఆహ్లాదకర వాతావరణంలో పరవశించారు. –సాక్షి, పాడేరు